సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం ; 6 ; సెప్టెంబర్ ; 2024



నల్లబెల్లం పట్టివేత

జడ్చర్ల వద్ద జాతీయ రహదారిపై భారీగా నల్లబెల్లం, నవసాగ్రం పట్టుబడింది.

వివరాలు 8లో ▸



పకడ్బందీగా ఉత్సవాలు

జోగుళాంబ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలని తీర్మానించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.6 /23.4

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆదిశిలా క్షేత్రంలో విజయవాడ కలెక్టర్



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారిని గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ కలెక్టర్ గిరిజాశంకర్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి ఘన స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను వివరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ చైర్మన్ దంపతులను శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి మెమొంటోను అందజేశారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

ఎర్రవల్లి: ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ రోడ్డు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రగతి సూచించారు. గురువారం ఇటిక్యాల మండల కేంద్రం నుంచి రైల్వే స్టేషన్ వరకు చేపడుతున్న రోడ్డు, కల్వర్టు పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆమె వెంట ఏఈ రాజేశ్వరి, పీఆర్ ఏఈ పాండు రంగారావు, ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, తదితరులు ఉన్నారు.

సొసైటీలు బాగుంటేనే డీసీసీబీ అభివృద్ధి



అలంపూర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు బాగుంటేనే డీసీసీబీ బ్యాంకులు సైతం వృద్ధిలోకి వస్తాయని డీసీసీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం అలంపూర్ పట్టణంలో జరిగిన పీఏసీఎస్ చైర్మన్లు, కార్యదర్శులు, బ్యాంకు అధికారుల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో రైతులు ఆహార ధాన్యాలతోపాటు, వాణిజ్య పంటలను అధికంగా పండిస్తున్నారని, కాని ఏ బ్యాంకులు ఎక్కువగా రుణాలు ఇవ్వడం లేదని, పీఏసీఎస్ ద్వారా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి ఎకరాకి రూ.60 వేల వరకు పంట రుణాలు, అవే కాక గొర్రెలు, బర్రెలపై రుణాలు ఇస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యా రుణాలు అందిస్తున్నాయని, గృహ నిర్మాణం కోసం కూడా ఎంతో మందికి డీసీసీబీ రుణాలు అందించిందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పీఏసీఎస్ చైర్మన్ల ఫోరం అధ్యక్షులు పోతుల మధుసూదన్ రెడ్డి, జనరల్ మేనేజర్ పురుషోత్తం రావు,డీజీఎం కృష్ణ ప్రసాద్, ఏజీఎంలు శ్రీనివాస్,రమేష్, సింగిల్ విండో డైరెక్టర్లు,సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

50 రోజులు.. 732 టీఎంసీలు

రెండేళ్ల తర్వాత జూరాలకు రికార్డుస్థాయిలో వరద



జూరాలకు భారీ వరద రావడంతో పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ (ఫైల్)

- ఒడిసిపట్టింది 22 టీఎంసీలే.. 710 టీఎంసీలు నదిలోకి..
- ఎగువ, దిగువన 240.682 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఏకధాటిగా భారీ వర్షాలు కురుస్తుండడంతో జూరాలకు భారీగా వరద పారుతోంది. ఫలితంగా ఉమ్మడి జిల్లా వరప్రదాయినిగా పేరొందిన.. కృష్ణానదిపై నిర్మించిన తొలి ప్రాజెక్ట్ ఇందిర ప్రియదర్శిని జూరాల జలకళను సంతరించుకుంది. సుమారు రెండేళ్ల తర్వాత జూరాలకు రికార్డు స్థాయిలో వరద పోటెత్తింది. జూలై 17న వరద మొదలు కాగా.. సెప్టెంబర్ నాలుగో తేదీ నాటికి జూరాలకు 732 టీఎంసీల నీరు వచ్చింది. ఇందులో 22 టీఎంసీల నీటిని ఒడిసిపట్టుకోగా.. మిగతా 710 టీఎంసీలను నదిలోకి వదిలేశారు. అదేవిధంగా ఎగువ, దిగువ జలవిద్యుత్ కేంద్రాల్లో కలిపి ఇప్పటి వరకు 240.682 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఎగువ, దిగువలోని 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టారు. కాగా.. వరద భారీగా వచ్చిన సమయంలో దిగువ కేంద్రంలోని ఆరు యూనిట్లలో ఉత్పత్తిని నిలిపివేశారు.

వాటాను వినియోగించుకునే పరిస్థితి లేదు..

వాస్తవంగా కృష్ణా బేసిన్ లో నిర్మించిన జూరాల ప్రాజెక్టుకు బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 17 టీఎంసీల నీటిని కేటాయించారు. కర్ణాటక ప్రాంతంలో ముంపు గ్రామాల సమస్య అపరిష్కృతంగా ఉండడంతో చివరకు 11 టీఎంసీలకు కుదించారు. అయితే జూరాల ప్రాజెక్ట్‌లోకి వరద నీటితో పాటు పెద్ద ఎత్తున బురద వచ్చి చేరుతోంది. దీంతో జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం కుదించుకుపోవడంతో కేవలం తొమ్మిది టీఎంసీలే నిల్వ చేస్తున్నారు. అందులో ఏళ్ల తరబడి బురద పేరుకుపోయిన కారణంగా ప్రస్తుతం కేవలం 7 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉంటుంది. దీని ద్వారా నిర్దిష్ట ఆయకట్టుకు ఖరీఫ్‌లో సాగునీటిని అందిస్తున్నప్పటికీ.. రబీలో మాత్రం సాగునీరు అందడం గగనమైంది. ప్రతిఏటా చివరి ఆయకట్టు దారులకు నీటి కోసం కొట్లాటలు తప్పడం లేదు.

గరిష్ఠంగా 3.88 లక్షల క్యూసెక్కుల వరద..

గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జూరాలకు పెద్ద ఎత్తున వరద రాలేదు. ఈ ఏడాది వానాకాలంలో ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో కృష్ణా బేసిన్‌కు భారీగా వరద నీరు పోటెత్తింది. కృష్ణా బేసిన్‌లో ఉన్న మహారాష్ట్రలోని ఉజ్జయిని, కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు భారీ వరద నీరు వచ్చి చేరుతుండడంతో నీటిని దిగువనున్న జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లకు విడుదల చేస్తున్నా రు. మన రాష్ట్రంలో కృష్ణా బేసిన్‌లో ఉన్న తొలి ప్రాజెక్ట్ జూరాలకు జూలై 17 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు గరిష్ఠంగా 3.88 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. అధికారులు గేట్లు ఎత్తి దిగువనున్న శ్రీశైలానికి నీటిని విడుదల చేస్తున్నారు.

నీటి వాటా హక్కును వాడుకోవాలి..



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సీమాంధ్ర పాలకుల కారణంగా కృష్ణా బేసిన్‌లో తొలి ప్రాజెక్ట్ జూరాలకు తీరని అన్యాయం జరిగింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం జూరాలకు 17 టీఎంసీ నీటి వాటా హక్కులు కల్పిస్తే.. ప్రాజెక్ట్ కట్టి అందుబాటులోకి వచ్చిన రెండు దశాబ్దాల కాలంలో ఒక్కసారి కూడా పూర్తిస్థాయి వాటా హక్కు వాడుకోలేదు. ప్రత్యేక రాష్ట్రం సాధించిన తర్వాత అయినా పాలకులు నీటి వాటా హక్కులు సాధించేలా అడుగులు వేస్తారని ఆశించాం. దశాబ్దకాలంలో ఆ ప్రయత్నం మచ్చుకైనా కనిపించలేదు. ఇప్పటికైనా పాలకులు నీటి వాటా హక్కులు వాడుకుని ఇక్కడి రైతాంగానికి పూర్తి స్థాయిలో రెండు పంటలకు సాగు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలి.

– ఎక్బాల్ పాషా, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్

ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు 22 టీఎంసీలు..

జూరాల ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుండడంతో ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. నెట్టెంపాడు ప్రాజెక్టుకు 4.488 టీఎంసీలు, భీమా–1కు 2.714 టీఎంసీలు, భీమా–2కు 3.217 టీ ఎంసీలు, కోయిల్‌సాగర్‌కు 1.784 టీఎంసీలు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 6 టీఎంసీలు, జూరాల కుడి కాల్వకు 2.242 టీఎంసీలు, ఎడమ కాల్వకు 2.237 టీఎంసీలు ఎత్తిపోశారు. మిగిలిన 710 టీఎంసీలను నదిలోకి వదిలినట్లు పీజేపీ ఈఈ జుబేర్ తెలిపారు.



నెట్టెంపాడు ఎత్తిపోతల భాగంలో గుడ్డెందొడ్డి జలాశయానికి కొనసాగుతున్న నీటి పంపింగ్

గురువుల స్ఫూర్తితో రాణించాలి

- ఉపాధ్యాయ దినోత్సవంలో కలెక్టర్ సంతోష్
- 53మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



గురుపూజోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

గద్వాల టౌన్: గురువు లేకుండా ఏ ఒక్కరి ప్రతిభ వెలికి రాదని, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ రాణించాలని కలెక్టర్ సంతోష్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లాలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులగా ఎంపికైన 53 మందిని ఘనంగా సన్మానించారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు జీవితాన్ని అందిస్తారని, సమాజంలో ఉపాధ్యాయులకు గౌరవ ప్రదమైన గుర్తింపు ఉందని, దానిని కాపాడేందుకు ప్రతి ఉపాధ్యాయుడు మరింత కృషి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం, జిల్లా ఏర్పాటులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, అదే స్ఫూర్తితో జిల్లాలో అక్షరాస్యత పెంపునకు కృషి చేయాలని సూచించారు. ప్రతి టీచర్ అయిదు మంది విద్యార్థులను దత్తత చేసుకుని వారిని మోటివేట్ చేసి ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

విద్యార్థులు ఉన్నతస్థానంలో ఉండాలనే లక్ష్యాలను నిర్దేశించుకొని పట్టుదలతో దాన్ని సాధించాలని కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన యూపీఎస్‌సీ, సివిల్ సర్వీసెస్ పరీక్షల ఓరింటేషన్ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పట్టుదల, వ్యక్తిగత ప్రేరణ ఉన్నప్పుడే జీవితంలో ఏదైనా సాధించగలుగుతారన్నారు. క్రమశిక్షణ, లక్ష్యముంటే ఎంచుకున్న రంగాలలో ఎవరెస్ట్ అంత ఎత్తుకు ఎదగవచ్చని పేర్కొన్నారు. సబ్జెక్టులపై గ్రూప్ డిస్కర్షన్ మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే పరీక్షల్లో విజయం సాధించవచ్చన్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ తమ వ్యక్తిగత, వృత్తిరంగాలలో తమ సొంత అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసెస్‌పై విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ షేక్ కలందర్‌బాషా, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి ప్రియాంక, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి రమేష్‌బాబు, వైస్‌ప్రిన్సిపల్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని, అక్షరాస్యతలో వెనకబడిన మన జిల్లాను మొదటి వరసలో నిలపాలని, అందుకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల భాగస్వామ్యం ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తయారు చేసే బాధ్యత ఉపాధ్యాలదేనని చెప్పారు. గురుపూజా మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు, డీఈఓ రవీందర్, మార్కెట్‌యార్డు చైర్మన్ కుర్వ హనుమంతు, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, మాజీ ఎంపీపీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులతో కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

గద్వాల క్రైం: వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా గణేశ్ ఉత్సవాలను కులమతాలకు అతీతంగా ఐకమత్యంగా నిర్వహించుకోవాలన్నారు. విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తుందన్నారు. నిమజ్జనం రోజు విగ్రహాలను వీలైనంత త్వరగా ఊరేగింపులోకి తీసుకురావాలని సూచించారు. సమస్యలు సృష్టించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీ సత్యనారయణ, సీఐలు రవిబాబు, టాటబాబు, నాగేశ్వరెడ్డి, ఎస్ఐలు శ్రీనివాస్, శ్రీకాంత్, మత పెద్దలు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఉత్కంఠకు తెర

- అలంపూర్ మార్కెట్ కమిటీకి పాలకవర్గం నియామకం
- చైర్మన్‌గా బింగిదొడ్డి దొడ్డన్న.. వైస్‌చైర్మన్‌గా పచ్చర్లకుమార్
- ఉత్తర్వులు జారీ చేసిన మార్కెటింగ్ శాఖ



ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌కు మిఠాయి తినిపిస్తున్న అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ దొడ్డన్న, పచ్చర్ల కుమార్

అలంపూర్: అలంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీని నియమిస్తూ మార్కెటింగ్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అనుచరులుగా ముద్రపడిన ఉప్పరి దొడ్డన్న చైర్మన్‌గా, పచ్చర్ల కుమార్‌కు వైస్ చైర్మన్ పదవులు వరించగా.. మరో 16 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. దీంతో మార్కెట్ కమిటీ నియామకం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఆశావహుల ఉత్కంఠకు తెరపడింది. ఇదిలాఉండగా, చైర్మన్ ఉప్పరి దొడ్డెన్నది అయిజ మండలం బింగిదొడ్డి కాగా.. వైస్‌చైర్మన్ కుమార్‌ది రాజోలి మండలం పచ్చర్ల. వీరితోపాటు మార్కెట్ కమిటీ సభ్యులుగా కె.రుక్మనందర్ రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, యంగమ్మ గారి కృష్ణయ్య, నాగరాజు, సంధ్యపోగు గోరంట్ల సులోచన, ఎల్.రుక్మనంద రెడ్డి, చిన్న మస్తాన్, శ్రీకాంత్,లక్ష్మేందర్ రెడ్డి, ఎరుకల రంగస్వామి, పుప్పాల వెంకటేష్, ఎస్‌కే హమీద్, వడ్డేపల్లి పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిని, అలంపూర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, స్పెషల్ ఆఫీసర్, అలంపూర్ గ్రామ పంచాయతీ సభ్యులుగా నియమించింది.


ఆరు నెలలుగా నిరీక్షణ..

నామినేటెడ్ పదవులపై ఆశావహులు ఎన్నో ఆశలు పెట్టుకొని నెలల తరబడి నిరీక్షిస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో రెండు కీలక నామినేటెడ్ పదవులు ఉన్నాయి. అందులో రాష్ట్రంలోనే ఏకైక శక్తి పీఠమైన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఒకటి కాగా, రెండోది అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్ యార్డ్ చైర్మన్. ప్రస్తుతం ఈ రెండు పదవులు ఖాళీగా ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం మార్చిలో పదవులను భర్తీ చేసేందుకు సన్నాహాలు ప్రారంభించింది. కానీ, అవి పూర్తి స్థాయిలో భర్తీ కాలేదు. దీంతో ఆశావహుల్లో నిరాశ నెలకొంది. దీనికి తోడు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన చల్లా వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే విజయుడు, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారనే ప్రచారం జోరుగా సాగింది. ఈ కారణంగానే నామినేటెడ్ పదవుల భర్తీకి బ్రేక్ పడిందని, ఉత్తర్వులు నిలిచాయనే చర్చ కొనసాగింది. శ్రావణమాసంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం జరిగినా.. అవి ఊహాగానాలుగానే మిగిలాయి. దీంతో ఉత్కంఠకు తెరదించుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ శిబిరంలో సంబరాలు నెలకొన్నాయి. హైదరాబాద్‌లో చైర్మన్, వైస్ చైర్మన్ సంపత్‌కుమార్‌కు మిఠాయిలు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు.

నదీజలం.. కలుషితం

- కలుషితమవుతున్న తుంగభద్ర నదీజలాలు
- సమీప కాలనీవాసులకు విషజ్వరాల ముప్పు
- ఈ నీటితోనే జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరుడికి అభిషేకం
- మున్సిపల్ అధికారులు, సిబ్బంది తీరుపై ప్రజల అసహనం

డంపింగ్ యార్డు ఉన్నా.. నదీతీరంలో చెత్తా చెదారాల పారబోత



నదీతీరంలో అలంపూర్ ఆలయాల సముదాయం

జోగుళాంబ శక్తిపీఠం: 'గంగా స్నానం.. తుంగాపానం' అంటారు. తుంగభద్ర నదీ జలాలను సేవించాలని, గంగానదిలో మూడు మునకలు వేసి స్నానం ఆచరించాలనేది శాస్త్ర వచనం. ఈ రెండు నదులకు అంతటి పవిత్రత ఉందనేది దీని భావన. కానీ అలంపూర్ మున్సిపాలిటీలోని కొందరి చర్యలతో తుంగభద్ర నదీజలాలు కలుషితమవుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఏపీలోని కూటమికి చెందిన ఓ పార్టీ ముఖ్యనాయకుడి ఆల్కాలిస్ ఫ్యాక్టరీలోని వ్యర్థాలను తుంగభద్ర నది అవతలి వైపు నుంచి నదిలోకి మళ్లిస్తుండగా.. మరో వైపు అలంపూర్ మున్సిపాలిటీ సిబ్బంది పట్టణంలోని వ్యర్థాలు, చెత్తా చెదారాలను నదీతీరంలో పారవేస్తున్నారు. దీంతో పవిత్రమైన తుంగభద్ర నది కాస్తా అపవిత్రం.. నీరు కలుషితమవుతున్నాయి. ఈ పరిస్థితులను చూస్తున్న పట్టణ ప్రజలు ఇది మున్సిపాలిటీయా లేక మురికిపాలిటీనా అని ప్రశ్నిస్తున్నారు.

వృథాగా డంపింగ్‌యార్డు

మున్సిపాలిటీలోని కాశీపురం వెళ్లే మార్గంలో ఇటీవల రూ.50 లక్షలతో డంపింగ్ యార్డు నిర్మించారు. అలంపూర్‌లోని అన్ని వార్డుల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వాహనాల్లో సేకరించి డంపింగ్ యార్డులో డంప్ చేయాల్సి ఉంటుంది. కానీ మున్సిపాలిటీ సిబ్బంది మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరిస్తూ ఊరిలోని చెత్తా చెదారాన్ని అంతా తుంభద్ర నది తీరంలోనే డంప్ చేస్తున్నారు. దీంతో నదీజలాలు కలుషితమవుతున్నాయి. దీనికితోడు నదీ తీరాన్ని ఆనుకుని ఉన్న సంతోష్ నగర్, అంబేద్కర్ నగర్ కాలనీ వాసులకు ఇది సమస్యగా మారింది. సమీపానే ఈ కాలనీలు ఉండటంతో దుర్వాసన వెదజల్లుతుందని, ఇటీవల కురిసిన వర్షాలతో అ పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమల బెడద తీవ్రమై విషజ్వరాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తుంగభద్ర నదీతీరాన డంప్ చేసిన చెత్తా చెదారం

దోమల బెడద అధికమై..



డంపింగ్ యార్డు ఉన్నా కూడా నదీతీరంలో చెత్తను డంప్ చేయడం సరికాదు. అలంపూర్ జోగుళాంబ క్షేత్రానికి ఉభయ రాష్ట్రాల నుంచి రోజు ఎందరో భక్తులు వస్తుంటారు. జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారికి సైతం ఇదే నీటితో నిత్యం అభిషేకం చేస్తారు. నదీతీరాన ఉన్న కాలనీ వాసులకు సైతం దోమల బెడద అధికమై.. సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.

– బి.మహేష్, అలంపూర్

బాధ్యత తీసుకోవాలి



తుంగభద్ర నది సమీపంలో చెత్త డంప్ చేస్తుండడంతో జలాలు కలుషితమవుతున్న మాట వాస్తవం. ఆలయానికి ఈ నదీ జలాలే ఆధారం. ప్రతిరోజు నది నుంచి నీటిని ఫిల్టర్ చేసి వాడుతున్నాం. అభిషేకాలకు, అన్నదాన సత్రాలకు ఫిల్టర్ నీటినే వాడుతున్నాం. నదీజలాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలి.

– పురేందర్‌కుమార్, జోగుళాంబ ఆలయ ఈఓ

సమస్య పరిష్కరిస్తాం..



డంపింగ్ యార్డు వద్ద షెడ్‌కు రూఫ్ వేయిస్తున్నాం. బయో మైనింగ్‌కు టెండర్ వేసి వర్క్ ఆర్డర్ కూడా ఇచ్చాం. ఆలస్యం కావడంతో వారికి నోటీసులు సైతం జారీ చేశాం. త్వరలోనే పనులు పూర్తి చేసి డంపింగ్ యార్డులోనే చెత్తను వేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– పి.సరస్వతి, మున్సిపల్ కమిషనర్, అలంపూర్

జాతీయ విపత్తుగా ప్రకటించాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎంవీ రమణ

గద్వాల అర్బన్: రాష్ట్రంలో వరదలతో ప్రాణ, ఆస్తినష్టం జరిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి ఆర్థికసాయం అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎంవీ రమణ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వరదలు వచ్చిన రాష్ట్రాల్లో బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఒక న్యాయం, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు ఇంకొక న్యాయం చేయడం ఏమిటని ప్రశ్నించారు. నష్టం వాటిల్లిన ప్రతి ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం, వర్షాల వల్ల మరణించిన ఒక్కొక్కరి రూ.10లక్షలు చెల్లించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలావరకు పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో ప్రజలు విషజ్వరాలు భారిన పడుతున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ప్రత్యేక నిధులు విడుదల చేసి సమస్య పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాల్లో పార్ట్‌టైం పని చేస్తున్న ఉపాధ్యాయులను తొలగించడాన్ని ఖండిస్తున్నామని, వెంటనే విధుల్లో తీసుకోరావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, రేపల్లె దేవదాస్, పరంజ్యోతి, నర్మద, ఉప్పేరు నర్సింహ్మా తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

క్షణికావేశంలో.. భర్తను హతమార్చిన భార్య

నాగర్‌కర్నూల్ క్రైం: మద్యం తాగి వేధిస్తున్నాడని మనస్తాపానికి గురైన ఓ భార్య క్షణికావేశంలోనై భర్తను హతమార్చింది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. ఉయ్యాలవాడకు చెందిన నాగరాజు(38)కు తిర్మలాపూర్‌కు చెందిన సూర్యతో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. మద్యానికి బానిసైన నాగరాజు తరచుగా భార్యను వేధిస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి సైతం గొడవ జరగడంతో క్షణికావేశానికి గురైన సూర్య ఇంట్లోనే టవల్‌తో భర్తను ఊపిరాడకుండా చేసి హత్య చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై నాగరాజు చెల్లెలు రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నాగరాజుకు భార్యతోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

డెంగీతో విద్యార్థి మృతి


ఆదేశ్‌కుమార్(ఫైల్)

ధన్వాడ: నారాయణపేట జిల్లాలో డెంగీతో ఓ బాలుడు మృతి చెందాడు. ధన్వాడ మండల కేంద్రంలోని దళితవాడకు చెందిన బిళ్లకల్ల అశోక్‌కుమార్ కుమారుడు ఆదేశ్‌కుమార్ (10) స్థానికంగా భారతి విద్యానికేతన్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం జ్వరం రావడంతో మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించాడు. పరీక్షలు చేయగా డెంగీ అని తేలింది. బుధవారం బాలుడి ప్లేట్‌లేట్లు పడిపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే తీవ్ర అస్వస్థతతో ఉన్న బాలుడు అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదేశ్ చదివే పాఠశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, మాజీ కోఆప్షన్ సభ్యులు రహిమాన్‌ఖాన్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..


వెంకటప్ప(ఫైల్)

మాగనూర్: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ప్రమాదంలో గాయపడిన చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌బాబు వివరాల ప్రకారం.. మండలంలోని వడ్వాట్ గ్రామ సమీపంలోని శివాలయం దగ్గర బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో గుంటగారి చిన్న వెంకటప్ప(40)కు తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహనం ఢీకొని..

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన గురువారం ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ వివరాల ప్రకారం బుధవారం రాత్రి బీచుపల్లి స్టేజీ కమాన్ దగ్గర ఓ మహిళ జాతీయ రహదారి దాటుతుండగా కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గద్వాల మార్చురీకి తరలించారు. మృతురాలి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల వరకు ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్: 87126 70282 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

వనపర్తి రూరల్: చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరంగాపురం మండలంలోని జానంపేట గ్రామానికి చెందిన పాటిమీది మణెమ్మ (56) కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తమ్ముడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గొర్రెల దొంగలకు రిమాండ్



కృష్ణా: కర్ణాటకలో గుడ్మిట్‌కల్ తాలుకాలోని బద్దెపల్లి తండాకు చెందిన గొర్రెల దొంగ తుకారం రాథోడ్‌ను గురువారం 7గంటలకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కృష్ణా ఎస్‌ఐ ఎండీ నవీద్ తెలిపారు. గతంలో కున్సీ, హిందుపూర్ గ్రామాల మధ్య హైవేపై పలుమార్లు గొర్రెలు దొంగిలించాడని, అతనితో పాటు మరికొందరిని గతంలో అరెస్టు చేసినట్లు తెలిపారు. పక్కా సమాచారంతో తుకారంను అరెస్ట్ చేసి టవేరా, స్కూటీ, రూ.1.65లక్షల నగదు సీజ్ చేసినట్లు తెలిపారు.



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరాం, విద్యాశాఖ అధికారుల చేతుల మీదుగా సత్కారాలు అందుకున్నారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు కవిత, రాజశేఖరరావు, రఘురామరాజు, సునీత, నర్సింహులు, శంకర్‌గౌడ్, అధ్యాపకులు డాక్టర్ మాధురి, కిషోర్, సులేమాన్‌లు ఉన్నారు.

పకడ్బందీగా నవరాత్రి బ్రహ్మోత్సవాలు


పుష్కర ఘాట్ పరిశీలిస్తున్న ఈఓ పురేందర్‌కుమార్ తదితరులు

జోగుళాంబ శక్తిపీఠం: వచ్చేనెల 3 నుంచి 12 వరకు జరగబోయే దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని తీర్మానించారు. ఈ మేరకు గురువారం ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ గతేడాది జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గతేడాది కంటే ఈసారి ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు చేపట్టాలన్నారు. పూజా సమయాల్లో మార్పులు ఉంటాయని, టికెట్ల ధరలు పెంపు లేదన్నారు. మాలధారణ చేసే భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారి కోసం కుంకుమార్చన మండపాన్ని ప్రత్యేకంగా కేటాయించాలన్నారు. అలాగే బ్రహ్మోత్సవాల కోసం పురోహితులు, సిబ్బందిని తీసుకోవాలని, తెప్పోత్సవం ట్రయల్ రన్ నిర్వహించి చెక్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ, విక్రాంత్ శర్మ, జానకిరామశర్మ, శ్రీనివాస్‌శర్మ, వేదపండితులు శ్యాంకుమార్‌శర్మ, వెంకటకృష్ణశర్మ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ.35 లక్షలతో ప్రతిపాదనలు

ప్రసాద్ స్కీం కింద ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం రూ.35 లక్షలతో అధునాతన శౌచాలయాలు నిర్మించనున్నారు. ఇందుకోసం టూరిజం అధికారులు, సిబ్బంది ఈఓ పురేందర్‌కుమార్‌ను కలిసి అనువైన స్థలం కోసం పరిశీలించారు. అలాగే పుష్కర ఘాట్‌పై దుస్తులు మార్చుకునేందుకు, గోశాల నిర్మాణం విషయంలో తలెత్తిన ఇబ్బందులపై తహసీల్దార్ మంజుల ఆయా పనులను పరిశీలించారు.

■ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు. వారికి ఈఓ పురేందర్‌కుమార్ ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థ, ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.

జూరాలకు తగ్గిన వరద

- 82,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు
- 6 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల


ఎగువ జూరాలలోని జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద మరింత తగ్గుముఖం పట్టింది. బుధవారం 1,28,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. గురువారం సాయంత్రానికి 82 వేల క్యూసెక్కులకు తగ్గిందని పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నుంచి 6 గేట్ల ద్వారా 41,742 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 36,624 క్యూసెక్కులు, క్రస్టుగేట్ల ద్వారా 41,742, ఆవిరి రూపంలో 45, ఎడమ కాల్వకు 290, కుడి కాల్వకు 185, భీమా లిఫ్టు-2కు 650 క్యూసెక్కులతో కలిపి మొత్తం 79,536 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.531 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా, ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద ప్రవాహం మరింత తగ్గినట్లు అధికారులు తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 45,822 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 36,760 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 33,246 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 26,128 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.


11 యూనిట్లలో 435 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుందని జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు చెప్పారు. దిగువ జూరాలలోని జలవిద్యుత్ ఉప కేంద్రంలో 20 రోజుల అనంతరం విద్యుదత్పత్తిని పునఃప్రారంభించి పరిశీలించారు. ఎగువ నుంచి అత్యధికంగా వరద చేరడంతో విద్యుదుత్పత్తి చేపట్టలేకపోయామని అన్నారు. వరదనీరు ఇదే స్థాయిలో కొనసాగితే ఈ ఏడాది లక్ష్యానికి చేరుకుంటామన్నారు. ప్రస్తుతం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపడుతున్నట్లు వివరించారు. ఎగువలో 5 యూనిట్లలో 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్లలో 240 మెగావాట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నామని.. ఇప్పటి వరకు 240.682 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు. ఎగువ జూరాలలోని 3వ యూనిట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. వారి వెంట డీఈలు పవన్‌కుమార్, రాజు, రూపేష్, ఈఈ దర్బార్‌వలీ ఉన్నారు.

సుంకేసులకు 19 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కాస్త పెరిగింది. గురువారం 19,241 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. నాలుగు గేట్లను తెరిచి 17,916 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. అలాగే కేసీ కెనాల్‌కు 1,325 క్యూసెక్కులను విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు.

కోయిల్‌సాగర్ నుంచి ఒక గేటు ద్వారా..



దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి గురువారం ఒక గేటు ద్వారా నీటి విడుదల కొనసాగించారు. పెద్దవాగు నుంచి వచ్చే వరద తగ్గడంతో రెండు రోజులుగా ఒక గేటు ద్వారా మాత్రమే దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా, ప్రస్తుతం 31.6 అడుగుల నీటినిల్వ ఉంది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు గేట్లను తెరిచినప్పటి నుంచి సందర్శకుల సందడి ఎక్కువ అయింది. రోజు ఇటు దేవరకద్ర, అటు కోయిలకొండ వైపు పెద్దఎత్తున సందర్శకులు వస్తున్నారు. పిల్లలు, పెద్దలు నీటి విడుదల సమీపంలో కేరింతలు కొడుతున్నారు. చాలా మంది యువకులు చేపల కోసం ప్రాజెక్టు వద్దకు వస్తున్నారు.

తండ్రి మందలించాడని.. బాలుడి బలవన్మరణం


యశ్వంత్ (ఫైల్)

కల్వకుర్తి టౌన్/ ఉప్పునుంతల: నీళ్లలో ఆడుకుంటున్న కొడుకును ఆడవద్దని తండ్రి మందలించడంతో బాలుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఉప్పునుంతల మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మల్గం శ్రీనివాస్‌గౌడ్, భవాని దంపతులకు ఇద్దరు కుమారులు. శ్రీనివాస్ పిల్లల చదువుల కోసం అని కొన్నిరోజులు కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉన్నాడు. అయితే గత నెల 25న కల్వకుర్తిలోని తిలక్‌నగర్‌కాలనీలో కొత్తగా ఇల్లు నిర్మించి.. గృహప్రవేశం చేశాడు. గురువారం మధ్యాహ్నం తండ్రితోపాటు పెద్దకుమారుడు నిఖిల్ ఇంటిపై ఉన్న నీటి సంపును శుభ్రం చేస్తుండగా తాను కూడా దిగుతానని చిన్న కొడుకు యశ్వంత్(12) అనగా వద్దు అంటూ తండ్రి వారించాడు. దీంతో క్షణికావేశంలో యశ్వంత్ ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకొని కిటికీకి చీరతో ఉరివేసుకున్నాడు. వెంటనే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి యశ్వంత్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు క్షణికావేశంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పోస్టుమార్టం అనంతరం బాలుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. యశ్వంత్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. సాయంత్రం బాలుడి మృతదేహాన్ని స్వగ్రామం లక్ష్మాపూర్ తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

చోరీ కేసులో తండ్రీ కొడుక్కి జైలుశిక్ష

వీపనగండ్ల: పొలం పనులకు వెళ్తున్న మహిళ మెడలో ఉన్న 2 తులాల బంగారు గొలుసును చోరీ చేసిన తండ్రీ కొడుక్కి జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ గురువారం వనపర్తి జిల్లా ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారని ఎస్‌ఐ నందీకర్, కోర్టు కానిస్టేబుల్ రాజేందర్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలు గ్రామానికి చెందిన వెంకటస్వామి, అతడి కుమారుడు గోపాలకృష్ణ ఇరువురు 2020 నవంబర్‌లో మోటారు సైకిల్‌పై వస్తూ.. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం తూంకుంట గ్రామ సమీపంలో పొలం పనులకు వెళ్తున్న తూంకుంట గ్రామ నివాసి బత్తుల ఎల్లమ్మ మెడలో ఉన్న 2 తులాల బంగారు గొలుసును అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వారిద్దరిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో వారిద్దరికి 2 సంవత్సరాల 8నెలల జైలుశిక్షతో పాటు రూ. 200 చొప్పున జరిమానా విధిస్తూ వనపర్తి జిల్లా ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీలత తీర్పు ఇచ్చారని ఎస్‌ఐ తెలిపారు. పలు దొంగతనాల కేసుల్లో సంబంధం ఉన్న వీరు ప్రస్తుతం జైలులోనే ఉన్నట్లు పేర్కొన్నారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: ఇద్దరు బాలికలు అదృశ్యమైన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకోగా, గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం.. తెల్కపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో చదువుతున్నారు. బుధవారం ఇంటి నుంచి పాఠశాలకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు గురువారం షీ టీంను సంప్రదించారు. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐని వివరణ కోరగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

బురదలో చిక్కుకున్న బస్సు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామ శివారులో మినీ వంతెన నిర్మాణం చేపడుతున్న కారణంగా వాగులో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. గురువారం చెన్నిపాడు, మానవపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడుకు చెందిన 50 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలకు బస్సులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చెన్నిపాడు తాత్కాలిక వంతెనపై బస్సు బురదలో చిక్కుకుంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు నిర్మాణం సారిగా లేదని విద్యార్థులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కేసరి సముద్రంలో అరుదైన నీటికుక్కలు



'ముంగీస లాంటి ముఖం.. సీల్ చేపను పోలిన మెడ.. నీటిలో, నేలపై బతకగలిగే అరుదైన నీటి కుక్కల ఉనికి నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కేసరి సముద్రం చెరువులో కనిపించింది. నిశ్చలంగా ఉండే నీటివద్ద నీటి కుక్కలు ఎక్కువగా కనిపిస్తాయి. కృష్ణాతీరంలో అక్కడక్కడా వీటి ఉనికి ఉన్నా బయటకు ఎక్కువగా కన్పించవు. పెద్ద జలాశయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వస్తాయి. వీటి శాస్త్రీయ నామం 'అట్టర్' కాగా.. గతంలో నాగార్జున సాగర్, ప్రకాశం బ్యారేజ్ సమీపంలో కనిపించాయి. అంతరించిపోయే దశలో ఉన్న నీటి కుక్కలు నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో కనిపించడం ఆసక్తిరేపుతోంది.

- సాక్షి, నాగర్‌కర్నూల్

రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలుపర్చాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ సంక్షేమ సంఘం యూనియన్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ శాఖలో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలుపర్చాలని టీజీ ఎస్‌పీడీసీఎల్ కంపెనీ ప్రధాన కార్యదర్శి బీచుపల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ భవన్ ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఇన్ ప్రమోషన్‌ను సంస్థలో సరైన పద్ధతిలో అమలు చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, మహిళా ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేకూరుతుందన్నారు. తమ హక్కుల సాధన కోసం విద్యుత్ ఉద్యోగులు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోరాటంలో భాగంగా ఈ నెల 2నుంచి 10వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. 11నుంచి 16వ తేదీ వరకు ఎస్‌ఈ, డివిజనల్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 17న ఎస్‌పీడీసీఎల్ కార్యాలయం, 20న కంపెనీ ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ నాయక్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, డివిజన్ అధ్యక్షుడు తిరుపతయ్య, కార్యదర్శి రామకృష్ణ, సత్యం, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

భారీగా నల్లబెల్లం, నవసాగ్రం పట్టివేత


పట్టుబడిన బెల్లం బస్తాలు, వాహనాలు, నిందితులతో అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి

- ఇద్దరి అరెస్ట్

జడ్చర్ల: పట్టణంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి నిర్వహించిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో భారీగా నల్లబెల్లం, నవసాగ్రం, గుడుంబా పట్టుబడింది. గురువారం స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలం దేవదారికుంటతండాకు ఓ బొలేరో వాహనంలో 60 బస్తాల నల్లబెల్లం, 20 కిలోల నవసాగ్రం, 10 లీటర్ల గుడుంబా తరలిస్తుండగా పట్టణంలో సిబ్బంది నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో పట్టుబడిందన్నారు. సరుకు తరలిస్తున్న కాట్రావత్ శ్రీనును అదుపులోకి తీసుకొని విచారించగా హైదరాబాద్ శివారులోని శివరాంపల్లి వద్ద లారీలో తీసుకొచ్చిన నల్లబెల్లం, నవసాగ్రాన్ని కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు చెప్పారు. దీంతో శివరాంపల్లి క్రాస్‌రోడ్ వద్ద నిఘా ఉంచి కర్ణాటక బీదర్ నుంచి బెల్లం, నవసాగ్రం లోడ్‌తో వచ్చిన లారీని గుర్తించి పట్టుకొని డ్రైవర్ మహ్మద్ రఫీని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. లారీలో 30 కిలోల బరువున్న 650 బెల్లం బస్తాలతో పాటు 40 కిలోల నవసాగ్రం, 40 లీటర్ల గుడుంబా పట్టుబడిందని తెలిపారు. మూడు, నాలుగు నెలలుగా బీదర్ నుంచి లారీలో వీటిని తీసుకొచ్చి నల్గొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, జనగామ, కొల్లాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. దాడుల్లో రూ.21.30 లక్షల విలువగల 710 కిలోల బెల్లం బస్తాలు, రూ.6 వేల విలువగల నవసాగ్రం, 50 లీటర్ల గుడుంబా, బొలేరో, లారీని స్వాధీనం చేసుకున్నామని మొత్తం ఆస్తి విలువ సుమారు రూ.68.50 లక్షలు ఉంటుందన్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. డీఐజీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని, డ్రైవ్‌లో 9 వాహనాలు సీజ్ చేశామన్నారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీనివాస్, సీఐలు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శారద, విప్లవరెడ్డి, ఎస్‌ఐ సృజన్‌రావు, నాగరాజు పాల్గొన్నారు.

చిన్నోనిపల్లె.. ఛిద్రం

చిన్నోనిపల్లెలోకి చేరుకున్న రిజర్వాయర్ బ్యాక్‌వాటర్



ఇంటి ఆవరణలో నిలిచిన నీటిలో ఆడుకుంటున్న చిన్నారి



ఊరికి దూరంగా బయట పెట్టుకున్న ఇంటి సామగ్రి



వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు చిన్నోనిపల్లె గ్రామస్తులను నిరాశ్రయులను చేసింది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా గ్రామ సమీపంలో నిర్మించిన రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ గ్రామంలోకి రావడంతో ఆగమాగం అవుతున్నారు. రూ.వేల పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు నీట మునగడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. చేసేది లేక తట్టా బుట్టా సర్దుకొని ఉన్న ఊరు విడిచి ఒక్కొక్కరుగా వెళ్లిపోతున్నారు. - గట్టు